సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



న్యూస్‌రీల్

ఉత్తమ పోలీసులకు సేవా పతకాలు


పాడేరు సీఐ సుధాకర్

సాక్షి,పాడేరు: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం పలు ఉత్తమ సేవా పతకాలను ప్రకటించింది. పాడేరు సీఐ బి.సుధాకర్, ఏఆర్‌లోని ఆర్ఎస్ఐ కొయ్యి హరీష్‌లకు ముఖ్యమంత్రి శౌర్య పతకం లభించింది. కఠిన సేవాపతకానికి సంబంధించి ఏఆర్ డీఎస్పీ పి.మరియన్ రాజు, ఏఆర్ హెచ్‌సీ బి.కృష్ణారావు, ఏఆర్‌పీసీ ఎస్.రాజేష్‌కుమార్, మంప స్టేషన్ పీసీ, సీహెచ్.ఈశ్వరరావు, జి.మాడుగుల స్టేషన్ పీసీలు ఎ.వెంకటరమణ, ఎస్.బాబురావు ఎంపికయ్యారు. సేవా పతకాలకు సంబంధించి సీలేరు స్టేషన్ ఏఎస్ఐ జగత్‌రాయ్, పెదబయలు స్టేషన్ పీసీ, కె.కేశవరావు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎస్పీ తుహిన్ సిన్హాకు అభినందనలు


ఎస్పీ తుహిన్ సిన్హాను సత్కరిస్తున్న మహిళా పోలీసుల సంఘ జిల్లా ప్రతినిధులు

సాక్షి,పాడేరు: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తుహిన్ సిన్హాను జిల్లా సచివాలయాల మహిళా పోలీసుల సంఘ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసుల సంఘం జిల్లా అధ్యక్షురాలు పూజారి సత్యవతి, కోశాధికారి కిల్లు నూకరత్నం, సభ్యులు ఆదర్శిని, జయశ్రీ,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గృహ విలువ సర్వే వాయిదా

చింతూరు: పోలవరం ప్రాజెక్టు ముంపులో భాగంగా చింతూరులో నిర్వహించాల్సిన గృహాల విలువకు సంబంధించిన సర్వేను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తహసీల్దార్ సాయికృష్ణ తెలిపారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులు, సామాజిక ఆర్థిక సర్వేలో దాఖలైన సవరణలు, చేర్పులకు సంబంధించి విచారణ నిర్వహించిన అనంతరం తిరిగి సర్వే నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

అభ్యంతరాలపై విచారించాకే స్ట్రక్చర్ సర్వే

కూనవరం: ప్రయారిటీ హాబిటేషన్స్‌లో నిర్వహించిన గ్రామసభల్లో దాఖలైన అభ్యంతరాలు, సెస్ డేటాలో సవరణలు, చేర్పులపై విచారణ నిర్వహించిన తరువాతనే స్ట్రక్చర్ సర్వే జరుగుతుందని తహసీల్దార్ కె.అనసూయ తెలిపారు. ఈవిషయాన్ని సంబంధిత ప్రజలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని ఆమె పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

తొలిదశ కాంటూరులో చేర్చాలని వినతి

చింతూరు: మండలంలోని కుమ్మూరు పంచాయతీని పోలవరం ముంపులో భాగంగా తొలిదశ (41.15 కాంటూరు)లో చేర్చాలని సర్పంచ్ ముచ్చిక నాగార్జున కోరారు. గురువారం ఆయన కుమ్మూరులో మాట్లాడుతూ 2016లో తమ గ్రామంలోని రైతుల భూములకు భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసి గ్రామసభలు నిర్వహించారన్నారు. అయితే నేటికీ పరిహారం ఇవ్వలేదని తెలిపారు. తమ పంచాయతీ పరిధిలోని మామిళ్లగూడెం, సింగన్నగూడెం, కుమ్మూరు గ్రామాలు ప్రతి ఏడాది వరదలకు ప్రభావితం అవుతున్నాయన్నారు. దీనివల్ల మూడు గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారులు సమస్యను గుర్తించి తమ పంచాయతీని తొలిదశ కాంటూరులో చేర్చి పరిహారం అందించాలని ఆయన కోరారు.

మావోయిస్టుల కోటలో అభివృద్ధి బాట


కంచులగుమ్మి- వంచుర్బ మార్గంలో జరుగుతున్న తారురోడ్డు పనులు

- మెరుగుపడుతున్న రోడ్ల సౌకర్యం
- తీరనున్న దశాబ్దాల కల
- చురుగ్గా రోడ్ల పనులు
- గిరిజనుల్లో ఆనందం

పెదబయలు: మావోయిస్టులకు ఒకప్పుడు కోటగా ఉన్న ఇంజరి పంచాయతీ నేడు అభివృద్ధి బాట పడుతోంది. మండలంలో ఎక్కువ గ్రామాలు, అధిక విస్తీర్ణం గల ఇంజరి పంచాయతీకి రహదారి పెద్ద సమస్యగా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలంలోని గుల్లేలు పంచాయతీ జంగంపుట్టు కోంద్రుం వరకు 17 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.15.93 కోట్లు మంజూరయ్యాయి. ఈనిధులతో ప్రస్తుతం ఇంజరి పంచాయతీ కంచులగుమ్మి నుంచి వంచుర్బ వరకు తొలివిడతలో 10 కిలోమీటర్ల మేర తారురోడ్డు పనులు ప్రారంభం కావడంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో కాలినడక, గుర్రాలపై ప్రయాణం చేసేవారమని ఇప్పుడు చేపట్టిన తారు రోడ్డు పనులు ప్రారంభమైతే రహదారి సమస్య పరిష్కారమవుతుందని వారు పేర్కొన్నారు.

అటవీశాఖ అనుమతి కోసం..

ఇంజరి పంచాయతీ కంచులగుమ్మి నుంచి కోంద్రుం వరకు 10 కిలోమీటర్లకు, అయితే ఇందుకు సంబంధించి అనుమతి రావాల్సి ఉంది. ఇప్పటివరకు ఏడు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు, కల్వర్టుల నిర్మాణం పూర్తయింది. అటవీశాఖ నుంచి అనుమతి వస్తే పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం అందుబాటులోకి వస్తుంది.


పూర్తయిన తారు రోడ్డు

- ఇదే పంచాయతీలో మద్దిగరువు నుంచి జక్కం, ననుబరి మీదుగా కోంద్రుం 15 కిలోమీటర్ల మేర తారు రోడ్డుకు రూ. 12.45 కోట్లు మంజూరయ్యాయి. మద్దిగరువు నుంచి జక్కం వరకు ఐదు కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం పూర్తయింది. జక్కం నుంచి కోంద్రుం వరకు 10 కిలోమీటర్లు అటవీశాఖ అనుమతి రావాల్సి ఉంది. అటవీ శాఖ అనుమతి వస్తే ఇంజరి పంచాయతీలో సుమారుగా అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.

ప్రభుత్వం చొరవతో రోడ్డు ఏర్పాటు



ఇంజరి పంచాయతీకి తారు రోడ్డు అందుబాటులోకి వస్తుందని ఊహించలేదు. ప్రభుత్వం చొరవతో తారు రోడ్డు పనులు ప్రారంభయ్యాయి. రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పుడే మాకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు ఉంది. గుర్రాలు, కాలినడకన వెళ్లేవాళ్లం

– బి.నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ, ఇంజరి

అనుమతి వచ్చిన వెంటనే పనులు



జంగంపుట్టు నుంచి కోంద్రుం వరకు 18 కిలోమీటర్ల మేర తారురోడ్డు మంజూరైంది. ఇందుకు ఏడు కిలోమీటర్లకు అటవీశాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంది. అనుమతి వచ్చిన వెంటనే మిగతా పనులు పూర్తిచేస్తాం. జక్కం నుంచి కోంద్రుం రోడ్డుకు పది కిలోమీటర్ల మేర అనుమతి రావాల్సి ఉంది.

– ఎం.శంకరరావు, ఏఈ, పంచాయతీరాజ్, పాడేరు

మ్యుటేషన్ల ప్రక్రియ వేగవంతం

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశం


సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

రాజవొమ్మంగి: మ్యుటేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. గురువారం రాజవొమ్మంగి సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు విచ్చేశారు. 2001లో జారీ అయిన ఓ కుల ధ్రువీకరణ పత్రంపై విచారించారు.తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచారికి పలు సూచనలు ఇచ్చారు. కుటుంబ యజమాని చనిపోతే వంశపారంపర్యంగా వస్తున్న భూమిని కుటుంబసభ్యులకు పంచి ఇవ్వాలని ఆదేశించారు.

ఈ ప్రక్రియలో కుటుంబంలోని ఆడపడచులను కూడా విచారించి పట్టా భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్లు మంజూరు చేయాలని పలువురు కోరారు. సచివాలయానికి వచ్చిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సబ్‌కలెక్టర్ ఆదేశించారు. శ్మశానవాటిక లేదని, కాలువ పొంగితే మృతదేహాన్ని తరలించడం మరీ ఇబ్బంది కరంగా మారిందని సర్పంచ్ గొల్లపూడి రమణి సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.మండలంలోని 8 గ్రామాలకు చెందిన దాదాపు మూడు వేల ఎకరాలకు సాగునీరందించే వట్టిగెడ్డ రిజర్వాయర్ ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల నిరుపయోగంగా మారిందని రైతులు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పంటకాలువలకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, ఎంపీటీసీ గంగదుర్గ, డీటీ సత్యనారాయణ, వీఆర్వో భారతి, పంచాయతీ సెక్రటరీ మల్లేశ్వర్రావు, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : విజయనగరం జిల్లా తాటిపూడి గురుకులంలో 2013–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 5,6,7,8 తరగతులు, జూనియర్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు వచ్చేనెల 20న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.నర్సింహరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24 వరకు గడువు ఉందన్నారు. పూర్తి వివరాలకోసం ఏపీ గురుకులం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. లేకుంటే 9866559615 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఐదో తరగతిలో..

కూనవరం: ఏపీ గిరిజన గురుకుల పాఠశాల కూనవరం (కోతులగుట్ట)లో 2023–24 విద్యాసంవత్సరంలో 5వతరగతి(ఇంగ్లీషు మీడియం)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.వాణి తెలిపారు. అలాగే 6, 8వ తరగతులు(ఇంగ్లీషు మీడియం)లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30 వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చేనెల 7వ తేదీన నిర్వహిస్తారని, మెరిట్ లిస్ట్ మే 15న ప్రకటిస్తారని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, 5లో ప్రవేశానికి 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల ఫోన్ నంబరు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. దరఖాస్తులు www.aptwrgurukulam.ap.gov.inలో గాని మీసేవ కేంద్రంలో ఆన్‌లైన్ సమర్పించాలని సూచించారు.

పాడేరులో 21న పెన్షన్ అదాలత్

జిల్లా ఖజానాధికారి ప్రసాద్‌బాబు వెల్లడి



పాడేరు రూరల్ : పాడేరులో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈనెల 21న పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానాధికారి ఆర్.ప్రసాద్‌బాబు గురువారం తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, జీపీఎఫ్ కేసులను సమీక్షించి పరిష్కరించేందుకు వీలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అధికారులు పింఛన్‌దారులకు, జీపీఎఫ్ సమర్థవంతంగా నాణ్యమైన సేవలు సకాలంలో అందించేందుకు డీడీవోలకు అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి చెందిన ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ అవగాహన కల్పిస్తారన్నారు. 21న ఉదయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే అవగాహన సదస్సును డీడీవోలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాకు చెందిన పింఛనుదారులు, వారి కుటుంబ పెన్షనర్లు, జీపీఎఫ్‌కు సంబంధించిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి ఈ పెన్షన్ అదాలత్‌కు హాజరు కావాలని కోరారు. పెన్షనర్లు ఫిర్యాదులు ఇచ్చేటప్పుడు వారి పేరు, పదవీ విరమణ చేసినప్పుడు చివరి హోదా, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ నంబర్, బ్యాంకు వివరాలు, పదవీ విరమణ తేదీ, అడ్రస్, ఫోన్ నంబర్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు, బ్యాంకు పాస్ పుస్తకం జతచేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మన్యం రచయితకు అరుదైన గౌరవం

- 'రాయవోయి కవిత'కు విశేష ఆదరణ
- కవి నూనె రమేష్‌కు ఘన సత్కారం


సాహితీ బ్రహ్మోత్సవాల్లో రమేష్‌ను సత్కరిస్తున్న అతిథులు

వీఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి గ్రామానికి చెందిన కవి, రచయిత నూనె రమేష్‌కు అరుదైన గౌరవం దక్కింది. తిరుపతి పుణ్యక్షేత్రంలో అంతర్జాతీయ సాహితీ సేవా సంస్థ శ్రీశ్రీకళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 9,10 తేదీల్లో 48 గంటల పాటు నిర్వహించిన సాహితీ బ్రహ్మోత్సవాల్లో ఆయన వినిపించిన 'రాయవోయి కవిత' కు విశేష ఆదరణ లభించింది. అక్కడకు హాజరైన వారందరూ కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అలాగే శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త కొల్లి రమావతి తదితరులు రమేష్‌ను ఘనంగా సత్కరించారు. అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్, మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు అసోషియేషన్ నేషనల్ అకాడమి బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల్లో తన పేరు చేసినట్టు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులు అజరయ్య, శాంతమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

గిరిజనాభివృద్ధికి ఎనలేని కృషి


గోపాలకృష్ణ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్, అధికారులు


గోపాలకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు దంపతులు

- ఐటీడీఏ పీవోగా విశేష సేవలు
- మార్గదర్శకంగా పనితీరు
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- గోపాలకృష్ణ దంపతులకు ఘన సత్కారం

సాక్షి, పాడేరు: గిరిజనాభివృద్ధికి నిబద్ధతతో ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహించిన రోణంకి గోపాలకృష్ణ సేవలు మార్గదర్శకమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహిస్తూ అమరావతిలోని ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ విభాగం అదనపు సంచాలకులుగా బదిలీపై వెళుతున్న ఆయనకు పాడేరు ఐటీడీఏ యంత్రాంగం ఆత్మీయ వీడ్కోలుగురువారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం లక్ష్యంగా పనిచేయడంతో పాటు గతేడాది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్తజిల్లాకు పాడేరులో కలెక్టరేట్, వివిధ శాఖల జిల్లా కార్యాలయాల ఏర్పాటు, వాటి అభివృద్ధి పనుల వేగవంతానికి పీవోగా కీలకపాత్ర వహించారన్నారు. గత ఏడాది నుంచి ప్రభుత్వ పథకాల అమలులో చక్కని సహకారం అందించారని, ఆయన ఎక్కడ పనిచేసినా తమకు ఇదే సహకారం కొనసాగించాలని కలెక్టర్ కోరారు. విద్య వైద్యం, వ్యవసాయం, ఉద్యానవనశాఖ, ఇతర సంక్షేమ పథకాల అమలులో పీవో ఉత్తమ సేవలు అందించారని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ కొనియాడారు. ఆయన హయాంలో గిరిజన అభ్యర్థులకు విశాఖలో ఉచితంగా సివిల్స్ కోచింగ్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు

అన్ని కార్యక్రమాలు కొనసాగిస్తాం: ఐటీడీఏ పీవో అభిషేక్

బదిలీపై వెళుతున్న పీవో గోపాలకృష్ణ హయాంలో అమలుచేసిన అన్ని గిరిజనాభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తానని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. రెండేళ్ల పాటు ఉత్తమ సేవలు అందించారన్నారు. మిషన్ కనెక్ట్ పాడేరు, మిషన్ ఏకలవ్య, విద్య, వైద్యం కార్యక్రమాలన్నింటిని అమలుజేస్తామన్నారు.

గిరిజనులకు సేవ అదృష్టం: రోణంకి గోపాలకృష్ణ

రెండేళ్ల పాటు గిరిజనులకు ఐటీడీఏ పీవో సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నానని బదిలీపై అమరావతి వెళుతున్న ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ ఏడీ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి ఆచార వ్యవహారాలపై అవగాహన పెరిగిందన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో కలెక్టర్లు వినయ్‌చంద్, మల్లికార్జున, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ నేతృత్వంలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.

గోపాలకృష్ణ ఘన సత్కారం

బదిలీపై వెళుతున్న గోపాలకృష్ణ, మయూరి దంపతులకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు, జేసీ, ఐటీడీఏ పీవో అన్నిశాఖల అధికారులు ఘనంగా సన్మానించారు. దుశ్శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, ఏవో హేమలత, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్, కొండయ్యపడాల్, ఎస్‌డీసీ శర్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, జిల్లా వ్యవసాయాధికారి నందు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతుల సత్కారం

రోణంకి గోపాలకృష్ణను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు గురువారం ఘనంగా సన్మానించారు. జ్ఞాపిక అందజేశారు. గోపాలకృష్ణను గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నేతలు, ఉపాధ్యాయులు ఐటీడీఏ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, జెడ్పీటీసీ మత్స్యలింగం, ఏటీడబ్ల్యూవో రజిని, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు శ్రీనివాసపడాల్, ఎస్.ప్రభుదాస్, పూర్ణచంద్రరావు, గంగాభవాని,నాగేశ్వరరావు, సింహాచలం పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- దెబ్బతిన్న ఇళ్ల పైకప్పులు
- ఉరుములు, పిడుగులతో వర్షానికి ఆందోళన


చెట్టు కూలడంతో నుజ్జయిన ఆటో

కొయ్యూరు: ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గురువారం సాయంత్రం వీచిన గాలులకు గుడ్లపల్లి జంక్షన్ వద్ద భారీ చింత చెట్టు ఆటోపై కూలిపోయింది. అదేసమయంలో ఆటో డ్రైవర్ వెంటనే బయటకు వచ్చేయడంతో ప్రమాదం తప్పింది. ఆటో నుజ్జు అయింది. స్థానికులు వెంటనే చెట్టు తొలగింపునకు చర్యలు చేపట్టారు. సూరేంద్రపాలెంలో మొట్టడం అప్పారావు ఇంటి పైకప్పు రేకులు గాలికి ఎగిరిపోయాయి. మామిడికాయలు రాలిపోయాయి. విద్యుత్ లైన్లపై కొమ్మలు కూలడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.


జి.మాడుగులలో కురుస్తున్న వర్షం


దెబ్బతిన్న ఇంటి పైకప్పు రేకులు

కొనసాగుతున్న వర్షాలు

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో వడగాళ్లతో కుండపోత వర్షం కురిసింది.దీంతో వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి రోడ్డు,సాలభం, గడుతూరు, గెమ్మెలి, వంజరి–తాజంగి రోడ్లు ద్విచక్రవాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పిడుగులు పడటంతో ఆందోళనకు గురయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కోడిమామిడి, పోతురాజుగెడ్డ, మత్స్యగెడ్డ, రాళ్లగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో కామయ్యపేట, బాకూరు, ఉప్ప, సంతారి తదితర ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ఉరుములు,మెరుపులతో కూడిన వర్షానికి గిరిజనులు భయాందోళనలు చెందారు.

రాజవొమ్మంగి: మండలంలో గురువారం సాయంకాలం భారీ వర్షం కురిసింది. దీనితో జనజీవనం స్తంభించింది. జీడి మామిడికి నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి నిర్వహించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పిలుపు

సాక్షి,పాడేరు: బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లోను శుక్రవారం ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. ప్రజాప్రతినిధులు, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు పార్టీ నాయకులు జయంతి వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

- గ్రామాల్లో 'గడప గడపకు' విశేష ఆదరణ
- ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ధనలక్ష్మిలకు ఘన స్వాగతం

జి.మాడుగుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, అన్ని వర్గాలకు సంక్షేమం అందుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో నుర్మతి పంచాయతీ కరకదాటు, నుర్మతి, ఎస్.కొత్తూరు, ధానుడుకొండ గ్రామాల్లో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' ఎమ్మెల్యే నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల్లో 252 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు, క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కరించటానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, వైఎస్ ఎంపీపీ సత్యనారాయణ, పాడేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఎం.గాయత్రి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జీ మత్స్యకొండంనాయుడు, ఎంపీటీ సీలు విజయకుమారి,గబ్బాడి సన్యాసిదొర, సచివాలయ మండల కన్వీనర్ కళ్యాణం, వైఎస్సార్‌సీపీ నాయకులు చినబాబు ఆచారి,వలసయ్య, సోంబాబు, రామకృష్ణ,వరలక్ష్మి, బాలన్న, బొంజునాయుడు, పోతురాజు,హేమసుందర్, సూర్యప్రకాష్, బాలయ్య, రాంబాబు, బాలయ్యపడాల్, శ్రీనివాస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


నుర్మతి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారునికి బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, అనేక పథకాలు అమలు చేస్తోందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గూడ, లక్కేపుట్టు గ్రామల్లో గురువారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో 156 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి, రోడ్ల సమస్యలను స్థానికులు విన్నవించగా, త్వరలో వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పాల్గుణ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు శామ్యేల్, వైస్ ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ రవి ప్రసాద్, నాయకులు భూషణ్, కోటిబాబు, సచివలయం సిబ్బంది పాల్గొన్నారు.


గూడలో గ్రామంలో పర్యటిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: ప్రజా సమస్యలను పరిష్కరించి, మేలైన పాలన అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని యర్రంరెడ్డిపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని నువ్వుగంటిపాలెం, యర్రంరెడ్డిపాలెం ఎగువవీధి, దిగువవీధి గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 200 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, నాయకులు త్రిమూర్తులు, కనకరాజు, భారతిబాబు, మడిబాబి, నారాయణరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్, ఏపీఓ ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.


యర్రంరెడ్డిపాలెం గ్రామంలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పాలిటెక్నిక్ విద్యతో భవితకు భరోసా



- జిల్లా కోర్డినేటర్ డాక్టర్ సుజాత
- ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఈనెల 30 వరకు గడువు
- దరఖాస్తుదారులకు ఉచిత శిక్షణ

సాక్షి,పాడేరు: పాలిటెక్నిక్ కళాశాలల్లో సాంకేతిక, పారిశ్రామిక విద్యను అభ్యసించడం ద్వారా చక్కని భవిష్యత్తుకు భరోసా ఏర్పడుతుందని పాలిసెట్ 2023 జిల్లా కోఆర్డినేటర్, పాడేరు ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులు చదవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులంతా పాలిసెట్–2023 పరీక్షకు ఈనెల 30వతేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 10వతేదీన పాలిసెట్ 2023 ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. 2021–22 విద్యా సంవత్సరం నుంచి పాడేరు పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు (కో–ఎడ్యుకేషన్) అవకాశం కల్పించామన్నారు. మెరుగైన బోధనకు సంబంధించి పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయన్నారు. స్పాట్ అడ్మిషన్లకు తక్కువ ఫీజు వసూలు చేస్తామన్నారు. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ప్రభుత్వ,ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మరింత సమాచారానికి పాడేరు పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రంలో సంప్రదించాలన్నారు. పాలిసెట్–2023 పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు గాను ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.400 చెల్లించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి పాడేరు పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ 2023 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు తప్పనిసరి

జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి టి.విశ్వేశ్వరరావునాయుడు


ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి విశ్వేశ్వరరావునాయుడు

ముంచంగిపుట్టు: గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఖచ్చితంగా వైద్య సిబ్బంది నిర్వహించాలని జిల్లా క్షయ,కుష్టు వ్యాధి నివారణ అధికారి టి.విశ్వేశ్వరరావునాయుడు అన్నారు. మండల పరిధిలోని కిలగాడ, రూడకోట పీహెచ్‌సీలను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. మలేరియా, క్షయ, కుష్టు, టైఫాయిడ్ వ్యాధుల నమోదు రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో మాట్లాడి గిరిజన గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ముంచంగిపుట్టు సీహెచ్‌సీ, ఎస్ఎన్‌సీయూ కేంద్రాన్ని పరిశీలించి, రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది, ఆశలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం గిరిజన గ్రామాల్లో ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం వల్ల సత్వరమే వైద్యం, అవసరమైన మందులు అందించే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులతో నడవలేని, కదలేని రోగుల పరిస్థితి ముందే గుర్తించి ఆసుపత్రులకు తరలించాలన్నారు. రానున్న ఎపిడమిక్ సీజన్ కోసం ముందస్తు మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు నమోదయ్యే గ్రామాలను గుర్తించి స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చూడాలని, వైద్య సేవలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని కోరారు. ఎస్‌వో కైలాష్, వైద్యాధికారి రమేష్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో ముందంజ

సీఆర్‌పీఎఫ్ కమాండర్ చర్యణ్‌రాజ్


చిట్టంరాయిలో గిరిజనులకు సోలార్ లాంతర్లు అందజేస్తున్న కమాండర్, సీఐ సత్యనారాయణ

పెదబయలు: గిరిజన ప్రాంతంలో ప్రజలకు సామాజిక సేవలు అందించడంలో 198 సీఆర్‌పీఎఫ్ పోలీసు ముందుంటుందని ఆ బెటాలియన్ కమాండర్ పి, చర్యణ్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సీకరి పంచాయతీ సీకరి, చిట్టంరాయి గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే ఆదేశాల మేరకు సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. రెండు గ్రామాలకు సంబంధించి 160 మందికి సోలార్ లాంతర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది సీఆర్‌పీఎఫ్ సామాజిక సేవల్లో భాగంగా గిరిజన గ్రామాల్లో సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. దీనివల్ల ప్రజలకు పోలీసుల మధ్య మంచి స్నేహభావం బలపడిందన్నారు. గతంలో గిరిజనులకు దోమ తెరల పంపిణీ, వంట సామగ్రి, గొడుగులు, బస్ సెల్టర్ల నిర్మాణం తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. జి. మాడుగుల సీఐ సత్యనారాయణ, సీకరి సర్పంచ్ గుల్లేలి కృష్ణారావు, ఎంపీటీసీ వంతాల ఆనందరావు, నాయకులు కొర్రా కనకరాజు, కూడ రాజారావు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

గూడెంకొత్తవీధి: గిరిజన ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ సీఐ ఖలీల్ అన్నారు. లక్కవరపేట పంచాయతీ మారుమూల తూరుమామిడి గ్రామంలో గురువారం గూడెంకొత్తవీధి సీఆర్‌పీఎఫ్–234 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ జరిగింది. కార్యక్రమంలో భాగంగా పోలీసులు యువతకు క్రికెట్, వాలీబాల్‌కిట్లు అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు, చీరలు, మహిళలకు వంటపాత్రలను పంపిణీ చేశారు. గిరిజనులకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో 'పాడేరు' విద్యార్థి ప్రతిభ


గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయ్

పాడేరు రూరల్ : చిత్తూరులో ఈనెల 10న నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సత్తా చాటాడు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బీఏ స్పెషల్ తెలుగు చదువుతున్న పాలిక చిట్టిబాబు గోల్డ్ మెడల్ సాధించాడు. ఈనెల 14,15 తేదీల్లో జార్ఖండ్ రాజధాని రాంచి వైబీఎన్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టిబ్బాయ్, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, సీనియర్ అధ్యాపకులు రమేష్‌బాబు, మురళీధర్‌రావు, సాంబమూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

'వాకపల్లి తీర్పుపై పునరాలోచించాలి'


వాకపల్లి బాధిత మహిళలను పరామర్శిస్తున్న సత్తినపల్లి మాజీ ఎమ్మెల్యే భారతి

జి.మాడుగుల: మండలంలోని నుర్మతి వాకపల్లిలో గిరి మహిళల లైంగిక దాడి కేసులో తీర్పుపై కోర్టు పునరాలోచన చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళాతంత్ర సంఘం, మార్కిస్టు పార్టీ సభ్యురాలు, సత్తినపల్లి మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి కోరారు. గురువారం ఆమె మండలంలో వాకపల్లి గ్రామంలో బాధిత మహిళలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పును తప్పుపట్టడం లేదన్నారు. బాధిత మహిళల్లో ఇద్దరు అవమానం భరించలేక చనిపోయారని, మిగతావారు చచ్చి బతుకుతున్నారన్నారు. కోర్టు ఈ విషయాన్ని గుర్తించాలని ఆమె కోరారు. వాకపల్లి మహిళలు ఆర్థికంగా సహాయం కోరలేదని, మానసిక వేదనను గుర్తించి, మాకు న్యాయం చేయండని మాత్రమే కోరుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. వాకపల్లి గిరిజన మహిళలపై దాడి చేసిన పోలీసులకు జైలు శిక్ష పడేలా కోర్టు పునరాలోచన చేసి బాధిత మహిళలకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

అనకాపల్లి టౌన్: మహిళపై దౌర్జన్యం చేసిన ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్.నరసింగరావు చెప్పారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. కొప్పాక గ్రామానికి చెందిన మండా మరియ్యమ్మ కొనుగోలు చేసిన గృహంలోకి అదే గ్రామానికి చెందిన నీరుకొండ సాయిరాంకృష్ణ, నీరుకొండ అప్పారావు, నీరుకొండ సత్యవతి, నీరుకొండ మాధవి, నీరుకొండ వాణి, అడుసమల్లి విజయలక్ష్మి ప్రవేశించి దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ చెప్పారు.

ప్రశాంతంగా ముగిసిన కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విశాఖ డీఈవో చంద్రకళ

- డీఎస్సీ–98 అభ్యర్థులకు పోస్టింగ్‌లు
- 324 మందికి నియామక పత్రాలు అందజేత
- ఏజెన్సీలో తీరిన ఉపాధ్యాయుల కొరత

విశాఖ విద్య: డీఎస్సీ–98 అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు విశాఖ డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న డీఈవో ఎల్.చంద్రకళ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. జాబితాలో ఉన్న 201 నుంచి 355 సీరియల్ నంబర్ల వరకు గల అభ్యర్థులను మెరిట్ మేరకు ఒక్కొక్కరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీల జాబితాను కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులందరికీ కనిపించేలా ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అభ్యర్థులు తమకు నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకునేలా తగిన సమయం కేటాయించారు. రెండో రోజు పూర్తిగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే ఖాళీలను చూపించారు. కౌన్సెలింగ్ అనంతరం డీఈవో ఎల్.చంద్రకళ వారికి నియామక పత్రాలను అందజేశారు. దీంతో ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో గల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరింది. ప్రతీ పాఠశాలలో ఇద్దరేసి ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చినట్లైంది. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి, సూపరింటెండెంట్ కె.జగన్నాథరావు, పీఆర్‌వో వర్మ, అల్లూరి సీతారామరాజు డీఈవో కార్యాలయం నుంచి సూపరింటెండెంట్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు. 25 ఏళ్ల తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువు దక్కడంతో డీఎస్సీ–98 అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరిసింది.

324 మందికి పోస్టింగ్ : రెండు రోజులపాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 324 మందికి ఉపాధ్యాయులుగా నియామక పత్రాలను అందజేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిబంధనల మేరకు డీఎస్సీ–98లో 355 మందిని ఎంపిక చేసి కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. కౌన్సెలింగ్ నాటికి వీరిలో 60 ఏళ్లు నిండిన వారు ఇద్దరు ఉండటంతో వీరి పేర్లను జాబితా నుంచి తప్పించారు. మరో ఇద్దరు కౌన్సెలింగ్‌కు హాజరైనప్పటికీ, పోస్టింగ్‌లు తీసుకునేందుకు నిరాసక్తత వ్యక్తం చేశారు. 27 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్‌కు గైర్హాజరైనట్లు డీఈవో కార్యాలయ అధికారులు వెల్లడించారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో 93 మందికి మైదాన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు దక్కగా, 231 మందికి ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు.

సొంత మండలంలో పోస్టింగ్

మాడుగుల: పాతికేళ్ల నిరీక్షణ తర్వాత వీరవిల్లి గ్రామానికి చెందిన దొండా చిన వెంకన్న దొరకు ఉపాధ్యాయ పోస్టు వరించడంతో ఆనందంతో పొంగిపోతున్నారు. 1998 డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించడంతో ఆయనకు న్యాయం జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల తన ఆశయం నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఐదారేళ్లు పోరాడినా ఫలితం లేకపోవడంతో ఇక ఉద్యోగం రాదని చిన వెంకన్న దొర వ్యాపారం పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇప్పుడు సొంత మండలంలో ఉద్యోగం రావడంతో గురువారం మండలంలోని ఎం.కృష్ణాపురం పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు వచ్చిన సమయంలో తామంతా విజయనగరంలో కలిశామన్నారు. ఆరోజే మీ కల నెరవేర్చుతానని హామీ ఇచ్చారని, ఆనాటి మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి


దేవరాపల్లిలో మృతి చెందిన లెక్కల రమణ


శారదానదిలో పడి మృతి చెందిన వెలగా అప్పారావు


చోడవరంలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి


విద్యుత్ షాక్‌తో మరణించిన కన్నబాబు


చికిత్స పొందుతున్న రహమాన్

దేవరాపల్లి: అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. దేవరాపల్లికి చెందిన లెక్కల రమణ (54) డాబాపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి బుధవారం రాత్రి మృతి చెందినట్టు అడిషనల్ ఎస్ఐ బి.మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత మేడపై నిద్రించేందుకు వెళ్లిన రమణ ప్రమాదవశాత్తు కాలు జారి సిమెంట్ రోడ్డు మీద పడిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న అతనిని వెంటనే స్థానికులు దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మృతుడి భార్య సత్యవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు.

శారదా నదిలో జారి పడి..

యలమంచిలి: ప్రమాదావశాత్తు శారదా నదిలో జారిపడి మండలంలోని జంపపాలెంకు చెందిన వెలగా అప్పారావు (47)అనే కూలీ గురువారం మృతి చెందాడు.యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం జంపపాలెం గ్రామానికి చెందిన వెలగా అప్పారావు మధ్యాహ్నం ఒంటిగంట సమీపంలో కాళ్లు చేతులు కడుగుకోవడానికి నదిలోకి దిగాడు.ప్రమాదావశాత్తు కాలు జారడంతో నదిలో మునిగిపోయాడు.స్థానికులు గుర్తించి ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బయటకుతీసేసరికి ప్రాణాలు కోల్పోయాడు. అతని భార్య,పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు.ఇక మాకు దిక్కెవరు అంటూ వారు రోదించిన తీరు స్థానికులను కన్నీరుపెట్టించింది. భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

చోడవరం రూరల్: పట్టణంలోని లక్ష్మీపురం రోడ్డులో చోడవరం జిమ్‌కు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతిచెందాడు. గమనించిన స్థానికులు చోడవరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.అప్పలనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి ఆచూకీ కోసం ఆరా తీశారు. మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో అతిగా తాగడం వల్ల గాని, ఎండవేడి వల్లగాని మరణించి ఉండవచ్చని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా ఈ వ్యక్తి కొంత కాలంగా స్థానికంగా ఉంటూ తాపీమేస్త్రీగా పనులకు వెళ్లేవాడని, అతిగా మద్యం తాగే అలవాటు ఉందని, అతనిది శ్రీకాకుళం జిల్లా అని కొందరు కూలీల ద్వారా తెలిసిందని చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. అంతకుమించి అతని వివరాలు తెలియరాలేదన్నారు. శవపంచనామా జరిపి, అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు.మృతుడి ఆచూకీ తెలిసిన వారు చోడవరం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ అప్పలనాయుడు కోరారు.

విద్యుత్ షాక్‌తో...

మాకవరపాలెం: విద్యుత్‌షాక్‌తో ఓ తాపీమేస్త్రి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మాకవరపాలెం మండలం ముషిడిపాలెంలో జరిగిన ఈ ఘటనతో బుచ్చన్నపాలెంలో విషాదం అలముకుంది. బుచ్చన్నపాలెం గ్రామానికి చెందిన రుత్తల కన్నబాబు(40) ఎప్పటిలాగే గురువారం ఉదయం పక్క గ్రామమైన ముషిడిపాలెంలో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. చామంతిపురం గ్రామానికి చెందిన మరో మేస్త్రి షేక్ రహమాన్(44)తో కలిసి ఇనుప ఊచలను ఇంటి పైకి తీసుకెళుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు ప్రమావశాత్తూ తగిలి షాక్‌కుగురయ్యారు. దీంతో కన్నబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. రహమాన్‌కు తీవ్రగాయాలై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. రహమాన్‌ను 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు కన్నబాబుకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కన్నబాబు మృతితో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

రాజవొమ్మంగి: కుటుంబ కలహాల కారణంగా ఓ గిరిజనుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాతంగి గ్రామానికి చెందిన పాతర కోటిబాబు(38) అనే గిరిజనుడు బుధవారం తన చేనుమకాంలో ఉన్న దూలానికి ఉరి వేసుకున్నాడు. అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.